TS-27-0016491

ప్రజా పక్షం.. ప్రజా గొంతు..

జయ జయహే

# సూర్యోదయం

హైదరాబాద్ | సంపుటి -2 | సంచిక -20 | పేజీలు : 8 | ఎడిటర్ : శివకృష్ణ | శనివారం 4 ఏప్రిల్ 2026 | వెల : 4/-

**విలేకరులు కావలెను**

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న సూర్యోదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

**సెల్ : 9515342857**




## చేతులుతడిపితే..సై..సై

# లేదంటే..

# నై..నై




**అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు**
**కాసులిస్తే..రిజిస్ట్రేషన్లు**
**ఇంద్రేశం మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాల రిజిస్ట్రేషన్లపై నిఘా ఏది..?**

సూర్యోదయం న్యూస్ :- (సంగారెడ్డి జిల్లా) రఘునాయక్ 04 ఏప్రిల్ 2026

చేతులుతడిపితే..తప్పైనా..సై..సై.. లంచమివ్వకపోతే ఒప్పైనా..నై..నై.. అంటూ టౌన్ ప్లానింగ్,రిజిస్ట్రేషన్ల విభాగాలు తమ అవినీతి సామ్రాజ్యాన్ని విస్తరిస్తున్నాయి..అడిగినంత ఇస్తే ఎంత పెద్ద అక్రమ నిర్మాణాలైనా సక్రమమై సాగిపోతాయి..అధికారుల చేతులు తడపకపోతే అది ఎంత సక్రమమైనా ఆగిపోతాయి. ఇది ఇంద్రేశం పురపాలక సంఘంలో జరుగుతున్న నయా దందా..సంగారెడ్డి జిల్లా ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు, అక్రమ షెడ్లు అనధికార లేఅవుట్లకు సంబంధించి దొంగచాటున రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం లేదా ఉద్దేశపూర్వక సహకారంతో భవనాలకు మాత్రమే కాకుండా ఖాళీ స్థలాలకు కూడా డోర్ నంబర్లు కేటాయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నియమ నిబంధనలు పాటించకుండా అనధికారికంగా ఇచ్చిన డోర్ నంబర్ల ఆధారంగా ఇంటి పన్నులు వసూలు చేయడం ద్వారా అక్రమాలను చట్టబద్ధం చేసే ప్రయత్నం జరుగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదనుగా భావించిన కొందరు భూదందాగాళ్లు,అక్రమ నిర్మాణాల యజమానులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో బహిరంగంగానే రిజిస్ట్రేషన్లు చేపడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అనధికారికంగా కేటాయించిన ఇండ్లకు,స్థలాలకు రిజిస్ట్రేషన్లు జరగకుండా అడ్డుకోవాల్సిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు కూడా వత్తాసు పలుకుతూ మామూళ్ల మత్తులో సహకరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల సమన్వయ లోపం కారణంగా అక్రమాలకు అడ్డుకట్ట పడడం లేదని,ఇది భవిష్యత్తులో పెద్ద సమస్యలకు దారితీయవచ్చని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి అక్రమ డోర్ నంబర్ల కేటాయింపు,ఇంటి పన్నుల వసూలు,అక్రమ రిజిస్ట్రేషన్లకు బాధ్యులైన మున్సిపల్,రెవెన్యూ మరియు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌తో పాటు రెవెన్యూ యంత్రాంగాన్ని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.




